సాక్షి
అనంతపురం
శనివారం । 21 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికింది.



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరి రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/10.5°

జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

రైళ్లలో చోరీల కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: రైళ్లలో చోరీల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డీఆర్‌ఎం అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి, ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, ఏడీఆర్‌ఎం సూర్యనారయణ, మురళీకృష్ణ హాజరయ్యారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాల్లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నగేష్‌కుమార్, ఆర్పీఎఫ్ సీఐ రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా శంకరయ్య

అనంతపురం అర్బన్: జిల్లాలో కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌ఆర్‌సీ) డిప్యూటీ కలెక్టర్‌గా జి.శంకరయ్యను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం 57 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ ఇస్తూ జీఓ 133ను జారీ చేసింది. ఈక్రమంలోనే తహసీల్దారుగా ఉన్న శంకరయ్యకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చింది.

రేపు కానిస్టేబుల్ ప్రిలిమినరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉమ్మడి జిల్లాలో ఆదివారం పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ ఫక్కీరప్ప మీడియాతో మాట్లాడారు. ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మొత్తం 47 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 24,055 మంది హాజరవుతారన్నారు. పరీక్ష సమయం కంటే గంట ముందే కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. హాల్ టికెట్లతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే తీసుకురావాలన్నారు. అనంతపురం రీజినల్ కో ఆర్డినేటర్‌గా అదనపు ఎస్పీ నాగేంద్రుడు, గుత్తి రీజినల్ కో ఆర్డినేటర్‌గా గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప వ్యవహరిస్తారని తెలిపారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. అనంతపురం, గుత్తి సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలిప్పిస్తామనే మాయగాళ్ల వలలో పడొద్దని అభ్యర్థులకు సూచించారు. అలాంటి వారు తారసపడితే తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లేకుంటే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిందే

అనంతపురం: సీనియార్టీ జాబితాలో పేర్లు ఉన్న ఎస్జీటీలంతా తప్పనిసరిగా పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఇన్‌చార్జి డీఈఓ ఎస్.కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 శాతం (నేరుగా రిక్రూట్‌మెంట్)కోటానూ పదోన్నతులుగానే పరిగణించి అర్హులైన ఉపాధ్యాయులతో పోస్టులు సర్దుబాటు చేస్తామన్నారు. పదోన్నతికి సమ్మతించిన ఉపాధ్యాయులకు కోరుకునే స్థానాలను తాత్కాలికంగా పరిగణిస్తామన్నారు. ఉపాధ్యాయ బదిలీలు జరిగిన అనంతరం వారికి పోస్టింగ్ ఇస్తామని, ఎటువంటి పరిస్థితుల్లోనూ రివర్సన్ ఉండదన్నారు. పదోన్నతిని నిరాకరించిన ఉపాధ్యాయుల పేర్లను సంవత్సరం పాటు పదోన్నతుల్లో పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. సీనియార్టీ జాబితాలో పేర్లున్న ప్రతి ఉపాధ్యాయుడు ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురం సైన్స్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు సర్వీస్ రికార్డులతో హాజరు కావాలని సూచించారు.

హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆరు హుండీల కానుకలను శుక్రవారం దేవదాయ ధర్మదాయ ఉరవకొండ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామతులసి, ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. 129 రోజులకు సంబంధించిన కానుకలు లెక్కించగా రూ.21,83,941 లక్షల ఆదాయం వచ్చింది.

మీరే వారధులు

- సంక్షేమ పాలనే జగనన్న లక్ష్యం
- టీడీపీ దుష్ప్రచారం తిప్పికొట్టండి
- వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించండి
- కన్వీనర్లకు మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్, చిత్రంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మధుసూదన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, మాజీ ఎమ్మెల్యే విశ్వ

అనంతపురం సప్తగిరి సర్కిల్: పార్టీకి – ప్రజలకు మీరే వారధులని వైఎస్సార్‌సీపీ కన్వీనర్లకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉష శ్రీచరణ్ తెలిపారు. జగనన్న సర్కార్ అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత మీదేనన్నారు. సంక్షేమ పాలనపై ప్రతిపక్ష టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించేలా కృషి చేయాలన్నారు. శుక్రవారం నగరంలోని యాపిల్ గార్డెన్స్‌లో జగనన్న కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ సలహాదారులు చల్లా మధుసూదన్‌రెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల వారికీ అండగా నిలుస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. పేదల సొంతింటి కల నెరవేరుస్తూ.. డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యకమాలు చేపడుతూ జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలనతో ముందుకెళ్తున్నారన్నారు. ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటాన్ని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ జీర్ణించుకోలేకపోతోందన్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు, అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

క్లీన్ స్వీప్ లక్ష్యం

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా జగనన్న ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేశారని, ఈ నెల 25లోపు అన్ని సచివాలయాల పరిధిలో క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున గృహ సారథులను నియమించుకోవాలని కన్వీనర్లకు మంత్రి సూచించారు. ఇద్దరిలో ఒకరు తప్పనిసరిగా మహిళ ఉండాలని స్పష్టం చేశారు. నాయకత్వ లక్షణాలు కలిగి, ప్రజలతో కలిసిపోయే తత్వం ఉన్న వారిని ఎంపిక చేయాలన్నారు. వీరు ఇంటింటికీ వెళ్లి పార్టీ విధానాన్ని, ప్రభుత్వ పాలనను వివరించి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని ప్రచారం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ 'కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థ'ను రూపొందించారన్నారు.

బోగస్ ఓట్లపై నిఘా

రానున్న ఎన్నికల్లో బోగస్ ఓట్లతో లబ్ధి పొందాలని ప్రతిపక్ష టీడీపీ భావిస్తోందని మంత్రి, విప్, ఎంపీ, ఎమ్మెల్యేలు, సలహాదారులు అన్నారు. బోగస్ ఓట్లను అడ్డుకునే బాధ్యత కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. జిల్లాకు ఆనుకొని ఉన్న బెంగళూరు, బళ్లారి ఇతర ప్రాంతాల వారికి ఇక్కడ దొంగ ఓట్లు చేయించాలనుకున్న వారి కుట్రలను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఏడీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, నాయకులు చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, చింతా సోమశేఖర రెడ్డి, సుభాష్‌రెడ్డి, రంగస్వామి, గోవిందునాయక్, జింకల రామాంజనేయులు, కృష్ణవేణి పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు

ఏ ఎన్నికల్లోనైనా గెలిచాడా?

- లోకేష్‌పై ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం

అనంతపురం సప్తగిరి సర్కిల్: అసెంబ్లీకి గాని, పంచాయతీ సర్పంచ్ స్థానానికి గాని, కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేనిగ వ్యక్తి నారా లోకేష్.. అలాంటి వ్యక్తి 'యువగళం' పేరుతో యాత్ర చేసినా వైఎస్సార్‌సీపీకి వచ్చే నష్టమేమీ లేదు' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన అనంతపురంలో జరిగిన వైఎస్సార్‌సీపీ కన్వీనర్ల సమావేశానికి ముందు మంత్రి ఉషశ్రీచరణ్‌తో కలిసి తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీని 23 స్థానాలకే పరిమితం చేశారన్నారు. ఫోర్ ట్వంటీ వ్యక్తులు టీడీపీకి నాయకత్వం వహిస్తున్నారని, ఫేక్ సర్వేలతో కార్యకర్తలను మోసం చేస్తున్నారని విమర్శించారు. నాలుగు చానళ్లు, నలుగురిని కూటమిగా పెట్టుకుని ఏమి చెప్పినా ప్రజలు నమ్ముతారనే భ్రమల్లో ఉన్నారన్నారు. అసలు రాష్ట్రంలో టీడీపీ ఉనికే లేదన్న విషయం గుర్తించాలన్నారు. 150 నియోజకవర్గాల్లో టీడీపీకి నాయకత్వమే లేదన్నారు. అయినా అధికారంలోకి వస్తే తాము ఏదో పీకుతామని ప్రగల్బాలు పలుకుతున్నారని.. వారిలా మేమూ అనుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని హెచ్చరించారు. ప్రచార యావతో ప్రజలను చంపడమే మీ ధ్యేయమా అని టీడీపీ నేతలను ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. భూములు, స్థలాలు ఆక్రమించడం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం టీడీపీ నేతలకు అలవాటని విరుచుకుపడ్డారు. ఇప్పుడేదో సచ్ఛీలురు అన్నట్లు మాయమాటలు చెప్తూ.. వైఎస్సార్‌సీపీని ఓడించండని ప్రజలకు పిలుపునిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు మాట్లాడుతున్న భాషను మహిళలు ఛీదరించుకుంటున్నారని అన్నారు.

టీడీపీ నేతలవి దిగజారుడు రాజకీయాలు

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులకు భయం పట్టుకుందని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. అందుకే దిగజారుడు రాజకీయాలకు దిగుతున్నారన్నారు. తాను అవినీతికి పాల్పడ్డానని ఆరోపణలు వచ్చిన వెంటనే.. ఖండిస్తూ.. వాస్తవ విషయాలను ఆధారాలతో సహీ మీడియా సమక్షంలో విడుదల చేశానన్నారు. వాటిపై చర్చించేందుకు టీడీపీ నాయకులు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఈనాడు, ఏబీఎన్, ఉన్నం హనుమంతరాయచౌదరి, వారి కుమారులు, ఉమామహేశ్వర నాయుడు పై కోర్టులో కేసు వేస్తున్నామన్నారు. టీడీపీకి జెండా, అజెండా అంటూ ఏదీ లేదన్నారు.

నేర స్థలిలో ఆధారాలే కీలకం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేర స్థలిలో లభించే ఆధారాలే కేసుకు కీలకమని ఎస్పీ ఫక్కీరప్ప అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ క్లూస్ టీం విభాగం వినియోగించే వివిధ రకాల పరికరాలు, యంత్రాల పని తీరును ఎస్పీ సమీక్షించారు. అనంతరం నేర స్థలంలో ఏ పరికరాన్ని ఎలా వినియోగించి ఆధారాలు సేకరించి, భద్రపరుస్తారో పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో నిర్వహించిన డెమోను పరిశీలించారు. సర్ఫేస్ ఫుట్ ప్రింట్ (డస్ట్ ప్రింట్), సంకెన్ ఫుట్ ప్రింట్ (కుంగిన పాద ముద్రలు), సూక్ష్మమైన అతి చిన్న వస్తువులను సైతం గుర్తించే అల్ట్రావైలెట్ లైట్, మాదక ద్రవ్యాలను గుర్తించే నార్కోటిక్స్ కిట్, గన్ పౌడర్, ల్యాండ్‌మైన్ తదితర పేలుడు పదార్థాలను గుర్తించే ఎక్స్‌ప్లోజివ్ కిట్, నేర స్థలం ఛిద్రం కాకుండా ఉండేందుకు వినియోగించే కార్డోనింగ్ టేప్, క్రైం సీన్ ప్రొటెక్షన్ కిట్ తదితర పరికరాలు క్లూస్ సేకరణలో ఎలా పని చేస్తున్నాయో ఎస్పీ సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, క్లూస్ టీం ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ తిమ్మరాజు పాల్గొన్నారు.



క్లూస్‌టీం నిర్వహించిన డెమోను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

నేరాల నియంత్రణకు చర్యలు

బెళుగుప్ప: సాంకేతికతను అందిపుచ్చుకొని నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. శుక్రవారం బెళుగుప్ప పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా తక్షణ సమాచారం కోసం సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌ను కొత్తగా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ అనే అప్లికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా మిస్సింగ్ కేసులు నమోదైతే సమాచారం పూర్తిగా అప్లికేషన్‌లో ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్ రిజిష్టర్, ఏ స్టేషన్‌లో ఎవర్ని అరెస్టు చేశారో, ముద్దాయిల వివరాలు అన్నీ అప్లికేషన్స్‌లో ఉంటాయన్నారు. ముఖ్యంగా కోర్టులకు సంబంధించి చార్జ్‌షీటు వేయాలనుకుంటే ఆన్‌లైన్ ద్వారానే వేసుకొనే అవకాశం ఉందన్నారు. కోర్టు కేసు ట్రయల్స్ ప్రారంభమైనప్పటి నుంచి అన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు. జైలు నుంచి విడుదలయ్యే ఖైదీ వివరాలు కుడా ఇందులో ఉంటాయన్నారు. సైబర్ క్రైం నేరాలను నిరోధించడానికి 1930 నంబరుకు కాల్ చేయాలన్నారు. కాల్ చేసిన వెంటనే కంట్రోల్ రూం ద్వారా వివరాలు సేకరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా నిలపడమే లక్ష్యం

- ఉప రవాణా కమిషనర్ శివరామ్‌ప్రసాద్

తాడిపత్రి: అనంతను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) శివరామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తాడిపత్రి ఎంవీఐ కార్యాలయ అధికారులు నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఎంవీఐ కార్యాలయం నుంచి టెక్, సీవీఆర్ కళాశాలల విద్యార్థులు, ఆర్టీసీ డ్రైవర్లు, ద్విచక్రవాహన షోరూముల సిబ్బంది, ఆటో, ట్యాక్సీ తదితర వాహనాల డ్రైవర్లు, యువకులతో కలిసి వాకథాన్ చేపట్టారు. డీటీసీ శివరామ్‌ప్రసాద్, ఎంవీఐలు శ్రీనివాసులు, రాజగోపాల్, ఆర్టీసీ డీఎం శంకర్, ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌గుప్తా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించగా.. వాకథాన్ సీబీ రోడ్డు మీదుగా బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుంది. అక్కడే మానవహారంగా ఏర్పడి 'రహదారి భద్రత.. మనందరి బాధ్యత' అంటూ నినదించారు. అనంతరం అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ట్రక్కు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ రవాణా, పోలీసు, ఆర్టీసీ, ఇంజినీరింగ్, నేషనల్ హైవేస్, ఆర్అండ్‌బీ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు బ్లాక్‌స్పాట్స్ గుర్తించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే 'ఐరాడ్' యాప్ ఉపయోగాలను వివరించారు. ప్రమాదంలో గాయపడిన సమయంలో గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించగలిగితే ప్రాణం నిలిపిన వారవుతారన్నారు. క్షతగాత్రుల సమాచారాన్ని అటు పోలీస్, ఇటు ఆస్పత్రి (108 సిబ్బంది)కి సమాచారం అందించి సత్వర వైద్య సేవలతో ప్రాణాలు కాపాడిన గుడ్ సమారిటన్‌కు రూ.5వేల నజరానాను ప్రభుత్వాలు అందజేస్తున్నాయన్నారు. ఇలా ఎక్కువసార్లు గుడ్ సమారిటన్‌గా నిలిచిన వారిలో ముగ్గురిని జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసి, గణతంత్ర దినోత్సవం రోజున ఎస్పీ కార్యాలయం వద్ద అభినందించి, ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య పది శాతం మేర తగ్గిందన్నారు. వారంలో రెండుమార్లు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామన్నారు. రహదారి భద్రత మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు.



జెండా ఊపి వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న డీటీసీ శివరామ్ ప్రసాద్

విద్యా సమాచార దర్శిని యూ డైస్ ప్లస్

- మౌలిక వసతుల కల్పనకు సమాచారణ సేకరణ
- 26లోపు నివేదికల రూపకల్పన పూర్తికి నిర్దేశం

అనంతపురం: విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. ఇందులో భాగంగా యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ప్లస్ ద్వారా సమాచార సేకరణకు సిద్ధమైంది. సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధుల కేటాయింపు జరుగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల నుంచి 5,798 పాఠశాలల నుంచి సమాచారాన్ని సేకరించి, ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు సమాయత్తమైంది.

గతేడాది నుంచీ యూడైస్ ప్లస్

ఇప్పటి వరకు సమగ్ర జిల్లా విద్యా సమాచార వ్యవస్థను యూ–డైస్‌గా పేర్కొంటూ వచ్చారు. మరికొన్ని ఫీచర్స్‌ను జోడించి యూడైస్ ప్లస్ పేరిట సమాచార సేకరణ, నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. గతంలో పాఠశాల హెచ్‌ఎం ఇచ్చిన సమాచారాన్ని, మండల, జిల్లా స్థాయిలో పరిశీలన చేసిన తదుపరి రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్‌లో చేపట్టేవారు. ఈ ప్రక్రియలో కొంత సమాచారం కోల్పోయే అవకాశం ఉన్నందున, గతేడాది నుంచి పాఠశాల స్థాయిలోనే నేరుగా ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం ఇవ్వడం గమనార్హం.

మౌలిక సదుపాయాలకు ఆ సమాచారమే ప్రాతిపదిక

పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, పోస్టులను రేషనలైజేషన్ చేయడం, కొత్తగా అదనపు తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, కిచెన్ షెడ్స్, లేబొరేటరీ, ప్రత్యేక అవసరాలు చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, ఇలా ఏది మంజూరు చేయాలన్నా యూ డైస్ ప్లస్ సమాచారమే ప్రాతిపదిక. దీని ఆధారంగా సమగ్రశిక్షకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తాయి. ఇందుకే యూడైస్ ప్లస్ ద్వారా సేకరించే సమాచారం కీలకంగా మారుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల సమాచారం నిక్షిప్తం చేసేందుకు ఈ నెల 26న తుది గడువుగా నిర్దేశించారు.

పకడ్బందీగా సమాచార సేకరణ



ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల సమగ్ర సమాచారాన్ని పకడ్బందీగా సేకరించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. పాఠశాల స్థాయిలోనే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. హెచ్‌ఎంలు క్షేత్రస్థాయిలో ఉన్న కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలి. హెచ్‌ఎంలు ఇచ్చే సమాచారం పాఠశాల అభివృద్ధికి కీలకంగా ఉంటుంది.

– ఎస్.కృష్ణయ్య, ఇన్‌చార్జ్ డీఈఓ, అనంతపురం

'హై అలర్ట్ అప్లికేషన్'కు 'స్కోచ్ అవార్డు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసులు వినియోగించే హైఅలర్ట్ అప్లికేషన్‌కు 'స్కోచ్' అవార్డు వరించింది. జాతీయస్థాయి పురస్కారాన్ని ఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ నిర్వాహకుడు షమీర్ కొచ్చార్ శుక్రవారం ఆన్‌లైన్లో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడుకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అవార్డును అందుకున్న అదనపు ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఎస్పీ సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి 'హై అలర్ట్ అప్లికేషన్'ను రూపొందించారని తెలిపారు. జిల్లా నలుమూలల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు ఈ యాప్ వినియోగిస్తున్నామన్నారు. ప్రధానంగా కిడ్నాప్‌లు, చైన్ స్నాచింగులు, తదితర ఘటనలు చోటుచేసుకున్నప్పుడు నిందితులు తప్పించుకుపోకుండా ఈ యాప్ ఉపయోగపడుతోందన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు వాటిని సిబ్బంది దృష్టికి తెచ్చి అప్రమత్తం చేసేందుకు ఎస్పీ ఈ యాప్‌లో ఒక్క సమాచారం పంపితే చాలు జిల్లాలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి క్షణాల్లో చేరుతుందన్నారు. దీంతో పోలీసు అధికారులు పరిధులతో సంబంధం లేకుండా ఏకకాలంలో రహదారులపైకి వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేయడం, పరిస్థితులు సద్దుమణిగేలా సమాయత్తం చేయడం కోసం ఈ సేవలను వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్, యాప్ రూపొందించడంలో సహకరించిన మణికంఠ గౌతం పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో అవార్డు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ నాగేంద్రుడు


ముందస్తు ప్రణాళికతో పప్పుశనగ కొనుగోళ్లు

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశం

అనంతపురం అర్బన్: ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకుని పప్పుశనగ కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చైర్మన్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో పప్పుశనగ పంట ఆశాజనకంగా ఉందన్నారు. మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో అందరూ గోడౌన్‌లో పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ముందస్తు ప్రణాళిక తయారు చేసుకుని పప్పుశనగ కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో మిరప పంటకు నల్ల తామర పురుగు వచ్చి చాలా నష్టం వాటిల్లిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంత మేర నష్టం జరిగిందనే అంశాన్నిప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు.

ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ – క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ప్రతి రైతు ఈ–కేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 65 వేల మంది రైతుల ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. కంది పంట క్వింటాలు రూ.6,600 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని మండలి సభ్యులు, అధికారులకు సూచించారు. సమావేశంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, జేడీఏ చంద్రానాయక్, మండలి సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

అసత్య ప్రచారం చేస్తే కేసులు

- ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు
- ఇప్పటికే రెండు సంస్థలపై కేసులు నమోదు చేసిన పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో ఈ ఏడాది ' 14 రోజుల్లో 16 మంది అమ్మాయిల అదృశ్యమంటూ అసత్య ప్రచారం చేసిన రెండు సామాజిక మాధ్యమాలకు సంబంధించిన సంస్థలపై అనంత పోలీసులు కేసులు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన వివరాలమేరకు.. ప్రజలను తప్పుదారి పట్టించి ఆందోళనకు గురిచేసే కథనాలను సామాజిక మాధ్యమాల్లో కొంత మంది ప్రసారం చేస్తున్నారు. వాట్సాప్, ఇతర మాధ్యమాల ద్వారా అనంతలో ఏదో జరిగిపోతోందన్న పరిస్థితులను కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసత్యాలను ప్రచారం చేస్తున్న రెండు సంస్థలపై కేసులు నమోదు చేశాం. క్రైం నంబర్ 25/2023 505 (2) ఐపీసీ అండ్ సెక్షన్ 74 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. ఈ మేరకు ఆ సంస్థల ప్రతినిధులు, వాట్సాప్‌లో పోస్టులు పెట్టిన ఆయా సంస్థల సిబ్బందికి కూడా నోటీసులు జారీ చేసేందుకు దర్యాప్తు చేపట్టాం. ఈ కేసు దర్యాప్తులో భాగంగా చేసిన పోస్టులను నిర్ధారించుకోకుండా తిరిగి సోషల్ మీడియాలో వాటినే పోస్ట్ చేసిన వారిని సైతం వదిలేది లేదన్నారు. వారికి కూడా నోటీసులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో అలజడి, ఆందోళన రేకెత్తేలా తప్పుడు సమాచారాలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విగ్రహాల పేరుతో రాజకీయం సిగ్గుచేటు

- టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే అనంత ఆగ్రహం
- మార్చిలోగా టవర్‌క్లాక్ బ్రిడ్జి ప్రారంభిస్తామని వెల్లడి

అనంతపురం క్రైం: 'రూ.313 కోట్లతో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగానే ఎన్‌హెచ్ అధికారులు మహనీయుల విగ్రహాలను తొలగించారు. అభివృద్ధి ఓర్వలేని టీడీపీ నాయకులు మహనీయుల విగ్రహాల పేరుతో రాజకీయం చేస్తుండటం సిగ్గుచేటు. తొలగించిన విగ్రహాలను ప్రతిష్టించేలా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకుంటారు' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 42వ డివిజన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్‌సీపీ అధికారంలో గడిచిన మూడున్నరేళ్లలోనే రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి నగరం రూపురేఖలు మార్చేశామన్నారు. రోడ్లు, కాలువల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మరో ఐదారు నెలల్లో అన్ని పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

మార్చిలోగా బ్రిడ్జ్

ఈ ఏడాది మార్చిలోగా క్లాక్‌టవర్ బ్రిడ్జ్‌ను అందుబాటులో తీసుకుని రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత స్పష్టం చేశారు. ఆశించిన దానికంటే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. మునిసిపల్ చైర్మన్‌గా అది చేశాను.. ఇది చేశాను అని చెప్పుకోవడంతోనే నగర ప్రజలు 2014లో ప్రభాకర్ చౌదరికి అవకాశం ఇచ్చారన్నారు. ప్రజలు నమ్మకంతో గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి చేయకపోగా, గ్రూపు రాజకీయాలతో నగరంలో ఆందోళనకరమైన వాతావరణాన్ని సృష్టించారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కేవలం డివైడర్లకే పరిమితమైందన్నారు. ప్రస్తుతం రాజకీయ కుట్రలో భాగంగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు టీడీపీకి తప్పక బుద్ధి చెబుతారన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరిలో గురువారం జరిగిన ఘర్షణలపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. మెచ్చిరికి చెందిన అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు గౌని గొల్ల హనుమంతరెడ్డి, గౌని గొల్ల భీమప్ప, గొల్ల కిష్టప్ప,గొల్ల శివణ్ణ, మేకల శివరాజు మరికొందరిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే గౌని గొల్ల భీమన్న ఫిర్యాదుతో వైఎస్సార్‌సీపీ నాయకులు నామాల చంద్రశేఖర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రామాంజి, నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులపై కేసు నమోదు చేశామన్నారు.

వరకట్నం కేసులో భర్త అరెస్ట్

ముదిగుబ్బ: మండల పరిధిలోని రామస్వామి తండాకు చెందిన పుష్పలత అనే మహిళ తన భర్త శ్రీకాంత్ నాయక్ అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురిచేస్తున్నట్లు శుక్రవారం పట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని శ్రీకాంత్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

- తండ్రి సబ్‌జైలుకు, కుమారుడు బాలనేరస్తుల గృహానికి తరలింపు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట జగనన్నకాలనీలో కలకలం రేపిన ఆశాబీ అనే మహిళ హత్య కేసులో నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం డీఎస్పీ మహబూబ్‌బాషాకు పక్కా సమాచారం రావడంతో రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్‌ఐ నబీరసూల్ సిబ్బంది అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆశాబీ మాజీ భర్త తపాల్ బాబా, కుమారుడు నూర్‌మహ్మద్ వలిని కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు తపాల్‌బాబాను సబ్‌జైలుకు, కుమారుడు మైనార్ కావడంతో బాల నేరస్తుల గృహానికి తరలించారు.

ఆటో బోల్తా .. వ్యక్తి మృతి


మృతుడు మునయ్య

శింగనమల: నార్పల మండలం వెంకటాంపల్లి నుంచి చామంతి పూలు తీసుకొని అనంతపురం మార్కెట్‌కు వెళ్తున్న ఆటో శింగనమల మండలం శివపురం వద్ద బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు మేరకు....వెంకటాంపల్లి నుంచి చామంతి పూలు కోసుకొని అనంతపురంకు ఆటోలో తలారి మునయ్య, చంద్రశేఖర్, నారాయణస్వామి బయలుదేరారు. శివపురం వద్దకు రాగానే ఆటో కింద కుక్క దూరడంతో ఆటో బోల్తా పడింది. దీంతో తలారి మునయ్య (62), చంద్రశేఖర్, నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తలారి మునయ్య మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. దీనిపై కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం


గాదిలింగ (ఫైల్)

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామం వద్ద హెచ్చెల్సీ కాలువలో బైక్ దూసుకెళ్లి గల్లంతైన గాదిలింగ (22) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. బళ్లారి రూరల్ ప్రాంతం చెరుకుంటకు చెందిన గాదిలింగ ఈనెల 17న శ్రీధర్ ఘట్టలో జరిగే ఊరిదేవరకొచ్చారు. తిరిగి వెళ్తుండగా అంబాపురం దగ్గర హెచ్చెల్సీ కాలువలోకి దూసుకెళ్లి కాలువలో గల్లంతైన విషయం విదితమే. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు, స్నేహితులు గాలించగా కణేకల్లు–యర్రగుంట మధ్యలో శవం లభించిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం బళ్లారిరోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేసి రూ. 1,85,100 స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... సుమారు 20 మంది పేకాట ఆడుతున్నారని సీఐ విజయభాస్కర్‌గౌడ్‌కు సమాచారం అందడంతో ఆయనతో పాటు ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. 20 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

శుద్ధజలం కాదు.. బోరు బావి నీళ్లు

- మినరల్ వాటర్ పేరుతో జోరుగా దందా
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో వెలుగు చూసిన మోసాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శుద్ధ జలం పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో జోరుగా సాగుతున్న నీటి దందా గుట్టును అధికారులు రట్టు చేశారు. బోరు బావుల్లోని నీటిని బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తేల్చారు. చాలా చోట్ల మినరల్ వాటర్ పేరుతో పలు బ్రాండ్ల పేరు మీద మార్కెట్లో లభించే వాటర్ బాటిళ్లను తయారు చేసి స్టిక్కర్లను సైతం ఇక్కడే అతికించి మార్కెట్లోకి పంపుతున్నట్లు అధికారులు గుర్తించారు.

9 బృందాలతో తనిఖీలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లోని శుద్ధ జలాల ప్లాంట్లలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపిన వివరాల మేరకు... ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఏక కాలంలో 9 బృందాలతో తనిఖీలు నిర్వహించాం. తనిఖీలో భాగంగా నీటి వ్యాపారం చేస్తున్న ప్లాంట్ల యజమానుల లైసెన్స్‌లను, ప్లాంట్‌లో శుభ్రతకు తీసుకుంటున్న చర్యలను గుర్తించాం. అదేవిధంగా నీటిని బాటిళ్లలో, ప్యాకెట్లలో నింపి ప్యాకింగ్ చేసే విధానంతో పాటు నాణ్యత పరిశీలించాం. ఇందులో భాగంగా నీటి నమూనాలను నాణ్యత పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులతో శాంపిళ్లను సేకరించి, వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపాము.


అనంత కేంద్రంగా వివిధ బ్రాండ్ల లేబుళ్లతో తయారు చేసిన వాటర్ బాటిళ్లు


బోరుబావిలో నీటిని నింపి వాటర్ బాటిళ్లకు లేబుల్ వేస్తున్న మహిళా కార్మికులు

బ్రాండ్ లేబుళ్లతో మోసం

అనంతపురంలోని నందిని మినరల్ వాటర్ ప్లాంట్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌లో ఫిల్టర్ పని చేయడం లేదు. అయినా వ్యాపారులు బోరు నీటిని బాటిళ్లలో నింపి మార్కెట్‌లోకి విక్రయాలకు పంపుతున్నారు. దీనికితోడు వాటర్ ప్లాంట్ వారు అనుమతి పొందిన బ్రాండ్‌నే కాకుండా హైదరాబాద్, కర్ణాటకకు చెందిన బ్రాండులకు సంబంధించిన లేబుళ్లను అతికించి వ్యాపారం చేస్తున్నారు. శుద్ధ జలం పేరుతో చేస్తున్న దందాకు సంబంధించి రిపోర్ట్ ద్వారా విజిలెన్స్అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి నివేదిక పంపాము. ఉన్నతాధికారులు, ల్యాబ్ ఎనాలిసిస్ రిపోర్ట్ వచ్చిన అనంతరం ఈ అక్రమాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో దాడులు చేసింది ఇక్కడే...

- **అనంతపురంలో** : నందిని మినరల్ వాటర్ ప్లాంట్, శ్రీలేఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ , శ్రీ వర ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్
- **తాడిపత్రిలో** : ఎస్.ఆర్. ఆక్వా ఉత్పత్తి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, పెన్నా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్
- **కదిరిలో:** సాయి నంది ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, గంగోత్రి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్
- **హిందూపురంలో** : రఫిక్ వాటర్ ప్లాంట్, లహరీ ఫిల్టర్ వాటర్, మినరల్ వాటర్

బాలికకు ఆశ్రయం... యువకుడిపై కేసు

- ఆమిద్యాలలో ఘటనపై కదిలిన యంత్రాంగం

ఉరవకొండ: బాలిక మెడలో పసుపుతాడు కట్టిన యువకుడిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి చిన్నారి చదువుకు ఇబ్బందులు లేకుండా బాల సదన్‌కు చేర్చారు. యువకుడిపై చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఆమిద్యాలకు చెందిన బాలికను ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడు...ఆ తర్వాత గ్రామస్తుల సూచన మేరకు బాలిక మెడలో పసుపుతాడు కట్టాడు. దీనిపై 'సాక్షి' గురువారం 'బాలిక మెడలో పసుపుతాడు' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ అమృతరాజుల శుక్రవారం ఆమిద్యాలకు వెళ్లి బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో పాటు ప్రేమ పేరుతో వంచించిన యువకుడికీ ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే తల్లిదండ్రులు, బంధువులకు కూడా శిక్ష ఉంటుందన్నారు. అనంతరం బాలిక కుటుంబీకులతో కలిసి ఉరవకొండ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం బాలికను అనంతపురంలోని బాల సదన్‌కు తీసుకువచ్చారు. ఉరవకొండ సూపర్‌వైజర్ తిరుపాల్ బాయి, వీఆర్‌ఓ గౌసియా తదితరులు పాల్గొన్నారు.


ఆమిద్యాలలో మైనర్ బాలికను వివాహం చేసుకున్న యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రోత్సాహకాలు

- మత్స్యశాఖ డీడీ డాక్టర్ శాంతి

అనంతపురం అగ్రికల్చర్: చేపలు, రొయ్యలు, పీతలు... ఇలా మత్స్య, అక్వా రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్కరూ మత్స్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.శాంతి తెలిపారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహక రాయితీలు అందాలంటే రిజిస్ట్రేషన్ తప్పని సరి అని సూచించారు. మత్స్యకార సహకార సంఘాల పరిధిలోని చేపల పెంపకం దారులు, చేపల పట్టే (వేట) వారు, సరఫరా, అమ్మకందారులతోపాటు సొంతంగానూ చేపలు పెంచుతూ క్రయ విక్రయాలు చేసే వారంతా తమ వివరాలు అందజేయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద వివిధ పథకాలతో లబ్ధి పొందుతున్నవారు, చేపల పెంపకందారుల వివరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. అలా కాకుండా జిల్లా వ్యాప్తంగా సంప్రదాయ మత్స్యకారులతో పాటు ఈ రంగంపై ఆధారపడిన ప్రతి ఒక్కరూ వివరాలు అందించాలన్నారు. పూర్తిస్థాయి డేటా అందుబాటులోకి వస్తే రీటైల్ షాపులు, హోల్‌సేల్‌షాపులు, హబ్‌లకు అనుసంధానం చేసి మత్స్యకారులకు స్థిరమైన ధర కల్పించడంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలతో నాణ్యమైన తాజా చేపలు, వాటి ఉత్పత్తులు అందించడానికి వీలవుతుందన్నారు. వివరాలు నమోదు చేయాలనుకునే వారు విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్లు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఎఫ్‌డీఓ), ఏడీ, డీడీలతో పాటు ఆయా కార్యాలయాల్లోనూ సంప్రదించవచ్చన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు **9912220717**

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

క్లుప్తంగా

నేడు 42వ డివిజన్‌లో 'గడప గడపకూ'

అనంతపురం క్రైం: నగరంలోని 42వ డివిజన్‌లోని 6వ రోడ్డులో శనివారం ఉదయం 6.30 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు..

ఆత్మకూరు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కొండన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు సచివాలయం -1లో ఒక పోస్టు, ఆత్మకూరు సచివాలయం-2లో రెండు, గొరిదిండ్ల సచివాలయంలో -1, సనప సచివాలయంలో -2, ముట్టాల సచివాలయంలో- ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30,31 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ఏపీజీబీ సేవలు సద్వినియోగం చేసుకోండి

రామగిరి: ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేరూరు బ్యాంక్ మేనేజర్ బాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లిలో రైతులకు, మహిళాసంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు, మహిళాసంఘాల సభ్యులకు ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. డిపాజిట్స్, పాలసీల విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రేపు ఎన్నికల నిఘా వేదిక సమావేశం

అనంతపురం కల్చరల్: ఏపీ ఎన్నికల నిఘా వేదిక కమిటీలను అనంత, శ్రీసత్యసాయి జిల్లాలకు వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నట్లు కో ఆర్డినేటర్ షేక్ నబీరసూల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హౌసింగుబోర్డులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనేక ఎన్నికల్లో నిఘా వేదిక సంస్థ సమర్థవంతంగా పనిచేసిందన్నారు. ఆ క్రమంలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆదివారం సాయంత్రం నూతన జిల్లాల కమిటీల ఎంపిక కోసం విద్యుత్‌నగర్‌లోని విద్యుత్ కళావేదిక పార్కులో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నిఘా వేదిక నియోజకవర్గాల కన్వీనర్లందరూ పాల్గొనాలని కోరారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



శివబాలయోగి ఆశ్రమంలో మాస శివరాత్రి పూజలు

అనంతపురం కల్చరల్: పుష్య మాసంలో వచ్చిన మాస శివరాత్రి వేడుకలు శుక్రవారం పలు శివాలయాల్లో ఘనంగా జరిగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరుడు ప్రత్యేక అలంకార సేవల్లో దర్శనమిచ్చాడు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రాత్రి స్వామివారికి ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించారు. మారుతీనగర్, ఆరో రోడ్డు శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ఏకవార రుద్రాభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తుల శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి.

ఇంటింటా సంక్షేమ కాంతులు



ఆరో రోడ్డులో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత



ప్రియాంకనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'మాలాంటి పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని ఊహించలేదు. నగరానికి సమీపంలోనే ఇంటి స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తుండటం ఎంతో సంతోషంగా ఉంది. అమ్మ ఒడి డబ్బుతో ఇద్దరి పిల్లల చదువులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా సాఫీగా సాగిపోతోంది.' పేదల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం పదికాలాల పాటు కొనసాగాలని హజీరా అనే మహిళ ఆశీర్వదించింది. ప్రతి ఇంటా ఏదో ఒక లబ్ధితోతో 'సంక్షేమ' కాంతులు వెల్లివిరియడం కనిపించింది. శుక్రవారం 42వ డివిజన్‌లోని ఆరో రోడ్డులో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రహంతుల్లాతో కలసి మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. 'అమ్మ ఒడి' డబ్బును ఒక్కగానొక్క కూతురు భవిష్యత్తు కోసం పొదుపు చేస్తున్నామని, ఆలమూరులో తమకు పక్కా ఇల్లు మంజూరైందని లీలావతి అనే మహిళ ఆనందం పంచుకున్నారు. సొంత పట్టా కల్గిన వారి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1,80,000 ఇస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రత్నమ్మ అనే వృద్ధురాలికి ఎమ్మెల్యే సూచించారు. వాహన మిత్ర ద్వారా వచ్చే డబ్బులతో ఆటో రిపేరీకు ఉపయోగపడుతోందని, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని మరువలేమని హసీనా (భర్త పేరు బాబాఫక్రుద్దీన్ ఆటోడ్రైవర్) తెలియజేసింది. దెబ్బతిన్న కరెంటు పోళ్లను మార్చాలని రమాదేవి అనే మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. ఆయన ఏఈ రవీంద్రప్రసాద్‌ను ఆదేశించారు. ఆరో రోడ్డులో రూ.16.70 లక్షలతో రోడ్డు, విస్తరణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో వీధుల్లో గుంతలను పూడ్చడానికి ప్యాచ్ వర్కులు, అవసరమున్న చోట రోడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఈ రాంప్రసాద్‌రెడ్డి, ఏఈ శంకర్, ఎమినిటీ సయ్యద్‌బాషాను ఎమ్మెల్యే ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. 61వ సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, ఇస్సాక్, చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, రామయ్య, జావేద్, గోవిందు, కుమ్మర ఓబులేసు, గౌరి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

అనంతపురం రూరల్: ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించేందుకు సీఎం జగన్ సచివాలయ - వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని ప్రియాంక నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ ప్రభాకర్‌చౌదరి రాజీవ్‌కాలనీని దత్తత తీసుకుని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే కాలనీని నగరానికి దీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, రహీమ్, దౌలా, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధించి, ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ సాల్మన్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని హంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సమ్మేటివ్ పరీక్షల్లో ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయని ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ సమ్మేటివ్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. ప్రణాళికాబద్ధంగా బోధించడం వల్ల విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ ఏడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. మన బడి నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు. జగనన్న గోరుముద్ద ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాల మురళి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి చరణ్, అగ్రికల్చర్ కార్యదర్శి అంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గర్భిణికి అరుదైన రక్తదానం



సాయి ట్రస్ట్‌కు బ్లడ్‌ను అందిస్తున్న శివ చౌదరి

అనంతపురం సప్తగిరి సర్కిల్: అరుదైన రక్తం గ్రూపు అవసరమున్న గర్భిణికి 'సాయి' సంస్థ ద్వారా రక్తదానం చేశారు. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన లావణ్య అనే గర్భిణికి అత్యవసరంగా బాంబే బ్లడ్ గ్రూప్ ఎక్కించాల్సి వచ్చింది. సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకున్న 'సాయి' సంస్థ అధ్యక్షుడు విజయసాయికుమార్, సభ్యుడు శివచౌదరి హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న సెల్ కంపెనీ సీనియర్ మేనేజర్ అఖల్ అనే యువకుడిని గుర్తించి.. అక్కడి కామినేని బ్లడ్ బ్యాంక్‌లో రక్తాన్ని సేకరించారు. అనంతరం ఆ రక్తాన్ని జాగ్రత్తగా భద్రపరచి.. ప్రత్యేక వాహనంలో కర్నూలుకు చేర్చి గర్భిణికి ఎక్కించారు. ఈ సందర్భంగా సాయి సంస్థకు గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న ఆర్టీఓ సురేష్‌నాయుడు

అనంతపురం సెంట్రల్: రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని రవాణా శాఖ ఆర్టీఓ సురేష్‌నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీఏ కార్యాలయంలో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అతివేగం, హెల్మెట్, సీటుబెల్టు లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని తెలిపారు. రహదారి నిబంధనలు పాటిస్తూ, రహదారుల సామర్థ్యం మేరకు వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమణారెడ్డి, సునీత, ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధనలు తెలియజేయండి



వివరాలు తెలుసుకుంటున్న ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబర్ కేశవరెడ్డి

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగులో శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు ఎప్పటికప్పుడు రైతులకు వివరించాలని హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు కేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రేకులకుంటలో ఉన్న ఉద్యాన పరిశోధన స్థానాన్ని పరిశీలించారు. పరిశోధన స్థానంలో భవనాలను, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలు, పరిశోధనా భవనాలను పరిశీలించారు. ఎంత మంది శాస్త్రవేత్తలు, దినసరి కూలీలు పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దినసరి కూలీలకు జీతాలు సక్రమంగా చెల్లించాలని కేశవరెడ్డిని కోరారు. రేణుక ఫర్టిలైజర్ నుంచి వ్యర్థ పదార్థాలతో కాలుష్యం పెరిగుతోందని కేశవరెడ్డి దృష్టికి గ్రామస్తులు, శాస్త్రవేత్తలు తీసుకొచ్చారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ దీప్తి, డాక్టర్ విమల, రైతులు మల్లికార్జున, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబులమ్మ

గార్లదిన్నె: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబులమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కొప్పలకొండ జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ కేంద్రాన్ని డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబులమ్మ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజూ కనీసం 60 మంది ఆధార్ సేవలు అందించాలన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంపీపీ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్పల: ప్రతి విద్యార్థీ బాగా చదివి రాబోవు పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపాలని ఎస్ఐ రాఘవరెడ్డి అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎస్ఐ రాఘవరెడ్డి చేతులమీదుగా శుక్రవారం అందించారు. ఎస్ఐ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చైర్మన్ , హిందీ పండితుడు జూటూరు షరీఫ్ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు, పేరెంట్స్ కమిటీ మెంబర్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

శింగనమల: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియాధికారి డి.ఓబులు అన్నారు. శుక్రవారం మండలంలోని పోతురాజుకాల్వ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులు, సామగ్రిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నూర్‌బాషా, సూపర్‌వైజర్ శేఖర్, గోవింద్, ఆరోగ్య కార్యకర్త హేమలత , సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ ర్యాంకింగ్‌లో జిల్లా క్రీడాకారులకు చోటు



రేటింగ్ సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్, ఫిడే సంయుక్తంగా విడుదల చేసిన ర్యాంకింగ్ జాబితాలో అనంతపురానికి చెందిన క్రీడాకారులకు చోటు దక్కింది. ఇంటర్నేషనల్ ర్యాపిడ్ రేటింగ్‌లో కిషోర్‌కుమార్ 1079, దేవరాజ్ 1033 రేటింగ్ సాధించారు. వీరిని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్‌కుమార్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రాక్టీస్ సెషన్‌లో ఆంధ్ర, గుజరాత్ జట్లు



ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్న గుజరాత్ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామం వేదికగా నిర్వహించనున్న అండర్-25 బీసీసీఐ కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో భాగంగా ఆంధ్ర, గుజరాత్ జట్లు శుక్రవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాయి. ఈ నెల 22 నుంచి 25 వరకు ఆంధ్ర, గుజరాత్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. మ్యాచ్ రెఫరీ సునీల్ చతుర్వేది ప్రాక్టీస్ సెషన్‌ను పర్యవేక్షించారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు

గుత్తి రూరల్: గ్రామాల్లో ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందించడమే ధ్యేయమని జల్‌జీవన్ మిషన్ జాతీయ నిపుణులు కపిల్‌దేవ్ శర్మ, కులదీప్ బ ద్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం కొజ్జేపల్లి, చెర్లో పల్లి, అనగానదొడ్డి, పెద్దొడ్డి గ్రామాల్లో జాతీయ జల్‌జీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటించింది. వారు మాట్లాడుతూ 2024 లోపు ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి నాగాంజన్ రెడ్డి, ఎకో సంస్థ సీఈఓ ఉస్మాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజ్‌కుమార్, ఏఈ మంజునాథ్, ఈఓ ఆర్డీ శివాజీరెడ్డి, సర్పంచ్‌లు వెంకటేష్, రామలింగమయ్య, లక్ష్మీదేవి, ఎఫ్ఏ ఉపేంద్రరెడ్డి, ఎంపీటీసీ వీరన్న, జేజేఎం కోఆర్డినేటర్ మౌళీశ్వర్ పాల్గొన్నారు.

దోబీ పోస్టులు భర్తీ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వం నిర్వహించే అన్ని సంస్థల్లోనూ దోబీ పోస్టులు భర్తీ చేయాలని రజక యువజన సంఘం నాయకుడు కసాపురం ఆంజనేయులు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయాలు, ఆస్పత్రులు, జైళ్లు, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న దోబీ ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకూ అర్హులైన రజక యువకులకు వాషర్ మెన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలన్నారు.

బాట మారెమ్మకు ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నైటింగేల్ విగ్రహ ఏర్పాటు స్థల పరిశీలన

అనంతపురం సప్తగిరి సర్కిల్: సర్వజనాస్పత్రి ప్రాంగణంలో ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ శుక్రవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు సూపరింటెండెంట్ ఆస్పత్రిలో పలు వార్డులను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, ఆర్ఎంఓ వైపీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి మృతికి నివాళి



మాబున్నీకి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్, కమిషనర్ తదితరులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ ఉద్యోగి మాబున్నీ మృతికి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఏపీసీ ఏసీపీ శ్రీనివాసులురెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఎస్ఈ నాగమోహన్, ఈఈ రామమోహన్ రెడ్డి, కార్పొరేటర్ గురుశేఖర్ బాబు, సీసీలు శ్రీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అల్ట్రా మారథాన్ రన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం అల్ట్రా మారథాన్, కమ్యూనిటీ రన్ నిర్వహించనున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రజల అభివృద్ధి కోసం చేపట్టే కమ్యూనిటీ రన్ కలెక్టరేట్ నుంచి అనంత క్రీడా గ్రామం వరకు కొనసాగనుంది. అల్ట్రా మారథాన్ రన్‌ను అనంత క్రీడా గ్రామం నుంచి మొదలై, బత్తలపల్లి ఆస్పత్రి వరకు సాగుతుంది. శ్రీసత్యసాయి జిల్లాలోని వివిధ గ్రామాలను కలుపుతూ మొత్తం 120 మంది క్రీడాకారులు, 170 కి.మీ పరుగు పందెంలో పాల్గొంటారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని తపోవనం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సోమనాథ్‌నగర్, కళ్యాణదుర్గం, రాచానపల్లి పంచాయతీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ కుళ్లాయప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఏసీఎల్‌ఓల నియామకం

అనంతపురం సప్తగిరి సర్కిల్: యాంటీ కరప్షన్ లైజనింగ్ ఆఫీసర్ (ఏసీఎల్ఓ)లుగా వెంకటేష్, నిరంజన్‌ను నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అనంత క్రీడా గ్రామం వేదికగా కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీలో భాగంగా ఈ నెల 22 నుంచి 25 వరకు ఆంధ్ర, గుజరాత్, 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆంధ్ర, బిహార్ జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ మ్యాచులకు వీరు ఏసీఎల్ఓలుగా వ్యవహరించనున్నారు.

పుస్తకాల వితరణ



వీసీకి పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ ఎం.శ్రీరాములు దంపతులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రరీకి రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీరాములు, ఆర్ట్స్ కళాశాల జువాలజీ లెక్చరర్ డాక్టర్ కేవీ చాముండేశ్వరమ్మ దంపతులు శుక్రవారం వితరణ చేశారు. వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను లైబ్రరీలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ విభాగాధిపతి ప్రొఫెసర్ దాశరథి రవీంద్ర, డాక్టర్ రఘోత్తమ్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చలిగింతలు

సరికొత్త సంతోషాలను తెచ్చిన సం'క్రాంతి' చల్ల చల్లగా ముగిసింది. గిలిగింతలు పెట్టే చలి.. అనంతపై వెచ్చని సూర్యకిరణాలు మీద పడగా మంచు దుప్పటి తీసి నిద్రమేల్కొంది. గజ గజ వణుకుతూ చిన్నాపెద్దా, యువత వెచ్చ వెచ్చని టీ, కాఫీ తాగుతుండగా.. వ్యాపారులు స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించి పల్లె బాట పట్టారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రైల్వే స్టేషన్ వద్ద ఆరుబయట చలిలోనే దుప్పటి కప్పుకొని నిద్రిస్తున్న దృశ్యం



చలికి గరం గరం చాయ్ తాగుతున్న ప్రజలు



వెచ్చదనం కోసం చలిమంట వద్ద కాచుకుంటున్న దృశ్యం



చలిలోనే ప్లాస్టిక్ సామాన్ల వ్యాపారానికి మోపెడ్‌పై బయల్దేరిన వృద్ధుడు